బెయిలొచ్చినా జైల్లోనే!

> మొదటిపేజీ తరువాయి...

అర్జున్ విషయంలో రిమాండ్ రిపోర్టు అంతా సిద్ధం చేసిన తర్వాతే అరెస్ట్ చేశారని తెలిసింది. శుక్రవారం అరెస్ట్ చేస్తే శని, ఆదివారాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జైలులో ఉంచొచ్చనే ప్లాన్ వేసినట్టు స్పష్టమవుతున్నది. పుష్ప-2 ప్రీమియర్ షోకు ఈ నెల 4న ప్రభుత్వం అనుమతిచ్చింది. సంధ్య థియేటర్‌లో ప్రదర్శించిన ఈ షోకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. సినిమాకు అల్లు అర్జున్ కుటుంబ సమేతంగా వచ్చారు. అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడం, తొక్కిసలాట చోటుచేసుకోవడంతో రేవతి అనే మహిళ చనిపోయింది. ఆమె కొడుకు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఘటనపై మృతురాలి భర్త మగడంపల్లి భాస్కర్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బీఎన్‌ఎస్ 105, 118(1) రెడ్ విత్ 3, 5 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 8న థియేటర్‌కు చెందిన ఇద్దరు యజమానులతో పాటు మేనేజర్‌ను అరెస్ట్ చేయగా తాజాగా అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు.

శుక్రవారమే ముహూర్తం!

తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని కోరుతూ రెండు రోజుల క్రితమే అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఒక వేళ పిటిషన్‌ను పరిగణలోకి తీసుకొని క్వాష్ చేస్తే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయలేమని పోలీసులు భావించినట్టు తెలుస్తున్నది. శుక్రవారం అరెస్ట్ చేస్తే బెయిల్ రావడం కష్టమని, దాంతో తప్పని సరిగా అల్లు అర్జున్‌ను జైల్లో పెట్టొచ్చని ప్లాన్ వేశారన్న చర్చ జరుగుతున్నది. అనుకున్నదే తడవుగా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ నివాసం చుట్టూ స్థానిక పోలీసులు మోహరించారు. రోడ్ నెం 45 నుంచి వచ్చే దారితో పాటు రోడ్ నెం 1 వైపు రాకపోకలపై నిఘా పెట్టిన జూబ్లీహిల్స్ పోలీసులు, అల్లు అర్జున్ ఇంట్లోనే ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాత చిక్కడపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉదయం 11.45 గంటలకు చిక్కడపల్లి ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తమ సిబ్బందితో అల్లు అర్జున్ ఇంట్లోకి దూసుకెళ్లారు. ఆ సమయంలో అల్లు అర్జున్ స్విమ్మింగ్ పూల్‌లో ఉన్నారు. ఆయన వద్దకు వెళ్లి అరెస్ట్ చేస్తున్నామంటూ తెలపడంతో షాక్‌కు గురయిన అర్జున్, తేరుకొని బట్టలు వేసుకొని వస్తానంటూ రెండో అంతస్థులో ఉన్న తన గదికి వెళ్లారు. రెండు మూడు నిమిషాలు వేచి చూసిన పోలీసులు నేరుగా బెడ్‌రూమ్‌వద్దకు వెళ్లారు. ఇంతలోనే అర్జున్ బయటకు వచ్చారు. 'అరెస్ట్ చేయడం ఒకే, కానీ ఇలా బెడ్‌రూమ్ దాకా రావడమేంటి? నేను పారిపోను.. మీతోనే వస్తా'నంటూ పోలీసుల ప్రవర్తనపై అసహనం వ్యక్తం చేశారు. ఇంతలోనే అర్జున్ తండ్రి అరవింద్ వచ్చి తాము హైకోర్టులో పిటిషన్ వేశామని, తీర్పు రాకముందే అరెస్టేమిటని ప్రశ్నించారు. తమకు పిటిషన్‌తో సంబంధం లేదని చెప్పిన పోలీసులు అర్జున్‌ను పై అంతస్థు నుంచి కిందకు తీసుకొచ్చారు. అంతకుముందే బయటకు వెళ్లిన ఆయన భార్య స్నేహారెడ్డి ఇంటికి వచ్చేదాకా వేచిఉన్నారు. విషయం తెలిసి ఆమె కన్నీళ్లు పెట్టుకోవడంతో అర్జున్ ఆమెకు, తన తండ్రికి ధైర్యం చెప్తూ పోలీసు వాహనంలో ఎక్కారు. మధ్యాహ్నం 1గంటకు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. రిమాండ్ రిపోర్టుతో సిద్ధంగా ఉన్న పోలీసులు వైద్య పరీక్షల కోసం గాంధీ దవాఖానకు మధ్యాహ్నం 2 గంటలకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షల తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకు నాంపల్లి కోర్టుకు తరలించి జడ్జి ముందు హాజరు పరిచారు. అప్పటికే అల్లు అర్జున్‌పై నమోదైన కేసును కొట్టేయాలని, ఆయనకు 105, 118(1)సెక్షన్లు వర్తించవని ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఓవైపు హైకోర్టులో వాదనలు కొనసాగుతుండగానే సాయంత్రం 5 గంటల ప్రాంతంలో నాంపల్లి కోర్టు అల్లు అర్జున్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో వెంటనే పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. చంచల్‌గూడ జైల్లోకి వెళ్లగానే హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది.

కావాలంటే కేసు ఉపసంహరించుకుంటా

అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఫిర్యాదుదారు భాస్కర్ స్పందించాడు. 'నా కొడుకు సినిమా చూస్తానంటేనే ఆ రోజు సంధ్య థియేటర్‌కు వెళ్లినం. అక్కడ అల్లు అర్జున్ తప్పేమీ లేదు. అవసరమైతే నేను కేసు విత్ డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నా.. ఆయనను అరెస్ట్ చేసిన విషయాన్ని కూడా పోలీసులు నాకు చెప్పలేదు' అని వివరించాడు.

భారీగా తరలివచ్చిన అభిమానులు

అర్జున్ అరెస్టు వార్త తెలిసి ఆయన అభిమానులు భారీ సంఖ్యలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్, గాంధీ, నాంపల్లి కోర్టు, చంచల్‌గూడ జైలు వద్దకు తరలివచ్చారు. ఒక్కోచోటుకు అల్లు అర్జున్ మారుతుండడంతో అభిమానులతో ఆయా రూట్లలో ట్రాఫిక్ తీవ్రంగా పెరిగింది.

చిరంజీవి, నాగబాబు పరామర్శ

విషయం తెలియగానే హీరో చిరంజీవి, సురేఖ దంపతులు హుటాహుటిన అల్లు అర్జున్ నివాసానికి చేరుకున్నారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కాసేపటికి నాగబాబు, ఇతర కుటుంబసభ్యులు కూడా వచ్చారు. సినీ ప్రముఖులు, బంధువులు పెద్ద సంఖ్యలో రావడం కనిపించింది.

అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్

హైకోర్టులో ఐకాన్ స్టార్‌కు భారీ ఊరట

సుదీర్ఘ వాదనల అనంతరం ఉత్తర్వులు

రూ.50 వేల పూచీకత్తు సమర్పించాలని షరతు

హైదరాబాద్ సెంట్రల్ జోన్ ఏసీపీ కార్యాలయంలో అభిమానులకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్

హైదరాబాద్, డిసెంబర్ 13, (నమస్తే తెలంగాణ): సినీ నటుడు అల్లు అర్జున్‌కు భారీ ఊరట దక్కింది. పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై అరెస్టయిన అల్లు అర్జున్‌కు శుక్రవారం హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసింది. రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచలగూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది. తొక్కిసలాటలో మరణించిన మహిళ భర్త ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టు చేయకుండా బెయిల్ మంజూరు చేయాలంటూ అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిసన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ఎదుట సుదీర్ఘ వాదనలు జరిగాయి. అల్లు అర్జున్‌తో పాటు సంధ్య థియేటర్ యజమానులు ఇద్దరికి మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. ఇంకా అరెస్ట్ కాని ఇతర నిందితుల్లో నలుగురు సంధ్య థియేటర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు ఉత్తర్వులను జారీచేశారు.

లంచ్ మోషన్ పిటిషన్

అల్లు అర్జున్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి లంచ్ మోషన్ పిటిషన్‌ను అనుమతించాలని కోర్టును కోరారు. సామాన్యులకు ఒకలా, అల్లు అర్జున్‌కు మరోలా చేయవద్దని పోలీసుల తరపున అదనపు పీపీ జితేందర్‌రావు వీలమల్లకు ప్రతివాదన చేశారు. అల్లు అర్జున్ పిటిషన్‌ను సామాన్యుడిగానే పరిగణించాలని నిరంజన్‌రెడ్డి కోరారు. సెలబ్రిటీ అని అల్లు అర్జున్ హక్కులకు భంగం కలిగించొద్దని గతంలో పుష్కరాలకు ఏపీ సీఎం హాజరైతే సుమారు 30 మంది చనిపోయారని, అప్పుడు కూడా ఇదే తరహా కేసు నమోదు చేశారా? అని ప్రశ్నించారు. అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు, ఇదే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చాయని గుర్తుచేశారు. లంచ్‌మోషన్ పిటిషన్‌పై రిజిస్ట్రీ అభ్యంతరంతో విచారణ తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు వాయిదా పడింది. సంధ్య థియేటర్ భాగస్వాములు దాఖలు చేసిన పిటిషన్ తరపున న్యాయవాది కరంచెంప కొమిరెడ్డి వాదించారు. పుష్ప- 2 బెనిఫిట్ షో ప్రదర్శనపై పోలీసులకు సమాచారం ఇచ్చామని, అన్యాయంగా కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారని.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రాజకీయ సభలు, ర్యాలీల్లో మరణించిన ఘటనల్లో ఇలాంటి ఘటనలపై నమోదు చేయని కేసులను ఇప్పుడెలా చేశారని తప్పుబట్టారు.

ఒక్కరోజు జైలులో ఉన్నా హక్కులకు భంగమే

ఒక్కరోజు పిటిషనర్ జైల్లో ఉన్నా హక్కులకు భంగం కలిగించినట్టేనని అల్లు అర్జున్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఏ ఆధారాలు లేకుండా నిర్బంధించడం చట్ట వ్యతిరేకమని,వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్టేనని చెప్పారు. హత్య జరుగుతుందని తెలిసి ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు.

షారూక్‌ఖాన్ రైలు ప్రయాణ సమయంలో..

షారూఖ్‌ఖాన్ ఒకసారి రైలులో ప్రయాణిస్తుండగా రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందంటూ పోలీసులు పెట్టిన కేసును కోర్టు కొట్టేసిందని అల్లు అర్జున్ తరపు లాయర్ గుర్తుచేశారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కేసు నమోదు చేశారని చెప్పారు. పిటిషనర్‌ను రిమాండ్‌కు పంపినా క్వాష్ పిటిషన్‌లో కోర్టులు మధ్యంతర బెయిల్ మంజూరు చేయవచ్చునని కోరారు. అర్నబ్ గోస్వామి వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు, బండి సంజయ్ అరెస్టు కేసులో ఇదే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులే నిదర్శమని చెప్పారు. ఈ రెండు కేసుల్లో మధ్యంతర బెయిల్ మంజూరు చేసినట్టుగానే అల్లు అర్జున్‌కు కూడా ఇవ్వాలని కోరారు.

రావద్దని పోలీసులు చెప్పారు: పీపీ

సంధ్య థియేటర్‌కు వస్తే తొక్కిసలాట జరిగే అవకాశం ఉన్నదని ఎస్‌హెచ్‌వో చెప్పినా అల్లు అర్జున్ ఖాతరు చేయలేదని పీపీ పల్లె నాగేశ్వరరావు తెలిపారు. నటుడు అయితే ప్రత్యేక హక్కులు ఉండవని చెప్పారు. థియేటర్ యాజమాన్యం, నటుడు పోలీసులకు సమాచారం ఇచ్చినంత మాత్రాన అనుమతి ఇచ్చినట్టు కాబోదని స్పష్టం చేశారు. పోలీసుల నుంచి అనుమతి మంజూరుకానందున తొక్కిసలాటకు వాళ్లే కారణమని చెప్పారు. ఇప్పటికే నిందితుడు అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని గుర్తు చేశారు. రిమాండ్ రిపోర్టు లేకుండా దానిపై ఉత్తర్వులు జారీ చేయడానికి వీలు లేదని చెప్పారు. పిటిషనర్ న్యాయవాది చెప్తున్న తీర్పులు ఈ కేసులో వర్తించబోమని, మధ్యంతర బెయిల్ మంజూరు చేయవద్దని వాదించారు.

పిటిషన్‌కు విచారణార్హత లేదు: పీపీ

భోజన విరామం తర్వాత పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదించారు. నిందితుడు అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారని, నాంపల్లి కోర్టు రిమాండ్ ఉత్తర్వులను జారీ చేసిందని చెప్పారు. కాబట్టి పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. నిరంజన్‌రెడ్డి కల్పించుకుని, సెలబ్రిటీ అని హక్కులను హరిస్తుంటే కోర్టులు జోక్యం చేసుకోవాలని కోరారు. లంచ్ మోషన్ అనుమతించాలో లేదో కోర్టులే తేల్చాలని కోరారు. జర్నలిస్ట్ అర్నబ్ గోస్వామి, భజనలాల్ కేసుల్లో అరెస్టు తర్వాత కూడా కోర్టులు జోక్యం చేసుకోవచ్చునని హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

ఆధారాలు లేవన్న హైకోర్టు

వాదప్రతివాదనల అనంతరం హైకోర్టు సూటిగా ఆధారాలను చూపాలని ఆదేశించింది. సంధ్య థియేటర్‌కు వస్తున్నట్టు పిటిషనర్ అల్లు అర్జున్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్టుగా ఆధారాలు చూపుతున్నారని, అల్లు అర్జున్‌ను అక్కడికి రావద్దని పోలీసులు చెప్పినట్టుగా ఆధారాలు చూపడంలేదని హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తొక్కిసలాటలో ఊరిరాడక మహిళ మరణిస్తే అందుకు సినిమాకు వచ్చిన అల్లు అర్జున్ బాధ్యుడు ఎలా అవుతారని ప్రశ్నించింది. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిలు మంజూరు చేయొచ్చని పిటిషనర్ లాయర్ ఉదహరిస్తున్న తీర్పులను పరిశీలించాలని పీపీకి చెప్పింది. మొత్తంగా ప్రాథమిక ఆధారాలను పరిశీలిస్తే పిటిషనర్‌కు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ కేసును నిరూపించడం లేదని అభిప్రాయపడింది. నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్టు వెల్లడించింది. రెగ్యులర్ బెయిల్ కోసం కింది కోర్టును ఆశ్రయించాలని పేర్కొన్నది. మధ్యంతర బెయిల్ పొందేందుకు జైలు సూపరింటెండెంట్‌కు రూ.50 వేల విలువైన వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది.

అల్లు అర్జున్ రాకతోనే తొక్కిసలాట

- **లెటర్ వచ్చింది, ప్రోగ్రాంపై చెప్పలేదు**
- **అరెస్టప్పుడు దురుసుగా ప్రవర్తించలేదు**
- **సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్**
- **ఇన్నాళ్లూ సమాచారం లేదన్న పోలీసులు**
- **ఏసీపీకి థియేటర్ యజమాన్యం రాసిన లేఖ బహిర్గతంతో ప్లేటు మార్పు**
- **పోలీసుల వైఫల్యాన్ని కప్పిపుచ్చే కుట్ర!**
- **నిఘా వైఫల్యంపై ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'**



SANDHYA 70 m.m.
(AIR-COOLED)
02-12-2024

To
The Asst. Commissioner of Police,
Chikkadpally PS,
RTC 'X' Roads,
Hyderabad.

Sir,

Sub: Request for arrangement of bandobust on 04-12-2024 and 05-12-2024 at Sandhya 70 MM theatre - Releasing of PUSHPA – 2 – Reg.

&&&&&

We request you to arrange to provide Police Bandobust at SANDHYA 70 MM RTC "X" Roads, Hyderabad in connection with release of PUSHPA – 2 on 04-12-2024 because there will be heavy fans crowd. The Hero, Heroine and VIPs and Production unit of the film are coming to see the movie.

We are screening picture of Mythri Movies PUSHPA – 2, Star caste: Allu Arjun, Rashmika Mandana and other stars on 04-12-2024 at 9.30 PM and on 05-12-2024 at 01.50 AM, 05-50 AM, 09-50 AM and 01-50 pm (i.e One show on 04-12-2024 and on 05-12-2024 - Four shows) and continues the movie regular.

We thank you for providing the police bandobust.

Yours faithfully,
For SANDHYA CINE ENTERPRISE 70MM
Manager

...Officer, Chikkadpally, Hyd.
2. Traffic PS, Chikkadpally, Hyd.

బందోబస్తు కోసం థియేటర్ యాజమాన్యం చేసిన దరఖాస్తు కాపీ

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ యజమాన్యం బందోబస్తు కోసం లెటర్ ఇన్‌వార్డులో ఇచ్చారని, ఆ తర్వాత పోలీస్‌స్టేషన్, ఏసీపీ, డీసీపీలను కలిసి ఈవెంట్ గురించి వివరించలేదని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. థియేటర్‌లో తొక్కిసలాట జరగడానికి అల్లు అర్జున్ రెండు గంటల పాటు అక్కడ ఉండడమే కారణమని వెల్లడించారు. తొక్కిసలాట ఘటనలో పోలీసులు ఇన్నాళ్లూ తమకు హీరో వస్తున్నట్టు ముందస్తు సమాచారం లేదంటూ చెప్తూ వచ్చారు. తాజాగా సంధ్య థియేటర్ యజమాన్యం డిసెంబర్ 4న సినిమా ప్రీమియర్ షో ఉన్నదని దీనికి అల్లు అర్జున్ ఆయన టీమ్ వస్తున్నందున బందోబస్తు ఇవ్వాలని చిక్కడపల్లి పీఎస్‌లో డిసెంబర్ 2న ఇచ్చిన దరఖాస్తు కాపీ శుక్రవారం బహిర్గతమైంది. దీంతో పోలీసులు నీళ్లు నములుతూ తమ తప్పేం లేదని, అల్లు అర్జున్‌దే తప్పంటూ ప్లేటు మార్చి ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఘటనపై వివరణ ఇస్తూ డీసీపీ ప్రకటన జారీ చేశారు. 'ప్రతి రోజూ మాకు బందోబస్తు కోసం రాజకీయ నాయకులు, ఫిలిం సెలబ్రిటీలు, మతపరమైన ప్రోగ్రామ్స్ తదితర అంశాలతో రిక్వెస్టులు వస్తుంటాయి. సెలబ్రిటీలు వచ్చినప్పుడు అనుమతి కోసం వచ్చే వారు పోలీస్‌స్టేషన్, ఏసీపీ, డీసీపీలను కలిసి ప్రోగ్రాం గురించి వివరిస్తారు. సంధ్య థియేటర్ యజమాన్యం తరపున ప్రోగ్రాం గురించి ఎవరూ మాకు చెప్పలేదు. కేవలం ఇన్‌వార్డ్ సెక్షన్‌లో లెటర్ ఇచ్చి వెళ్లారు. పోలీసులకు ఎంత మందిని బందోబస్తు విధులకు పంపాలనే విషయంపై స్పష్టత లేదు. థియేటర్ బయట జనాలను బట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. అల్లు అర్జున్ థియేటర్ వరకు వచ్చే దాకా పరిస్థితి అంతా అదుపులోనే ఉన్నది. ఆయన థియేటర్ వద్దకు చేరుకొని తన కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి చేతులూపుతూ వెళ్లారు. ఈ సమయంలో ప్రజలు చాలామంది థియేటర్ గేట్ వైపు వెళ్లారు. అదే సమయంలో ప్రైవేట్ సెక్యూరిటీ కూడా అల్లు అర్జున్ కారుకు దారి కల్పించేందుకు జనాలను పక్కకు నెట్టారు. రెండు గంటల పాటు అర్జున్ థియేటర్‌లోనే ఉన్నాడు. అతని చర్యలతోనే తొక్కిసలాటకు దారి తీసింది' అని డీసీపీ వివరించారు. కాగా శుక్రవారం అల్లు అర్జున్ భార్య పట్ల పోలీస్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ప్రచారం జరుగుతున్నదని, పోలీసులు ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు.

వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకేనా!

తొక్కిసలాట ఘటనలో పోలీసుల వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు ఉన్నతాధికారులు నానా తంటాలు పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. థియేటర్ యజమాన్యం, ప్రొడ్యూసర్స్ బందోబస్తు కోరినా పోలీసులు 'ఏదో' ఆశించి భంగపడి, భద్రత కల్పించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తీరా అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడంతో అంత సాఫీగా సాగిందనుకున్నారు. కానీ, థియేటర్ యాజమాన్యం భద్రత కోసం పోలీసులకు చేసిన దరఖాస్తు కాపీని కోర్టుకు సమర్పించడంతో సీన్ రివర్స్ అయింది. చిక్కడపల్లి ఏసీపీ, డీసీపీలపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ వ్యవహారంలో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మొత్తం చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ చూసుకున్నాడని కొందరు సిబ్బందే చెప్తున్నారు. కాగా ఇది ముమ్మాటికీ నిఘా వైఫల్యమేనని 'నమస్తే తెలంగాణ' ముందుగానే చెప్పింది. షో రాత్రి 9.30 గంటలకు ఉంటే 8 గంటలకు ప్రేక్షకులు భారీ సంఖ్యలో వచ్చారు. భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చిన విషయం తెలిసినా స్థానిక పోలీసులు, ఆయా డివిజన్, జోన్ అధికారులు, ముఖ్యంగా ఇంటెలిజెన్స్ సిబ్బంది ఎందుకు అప్రమత్తం కాలేదనే విమర్శలు వస్తున్నాయి.

రేవంత్ డైవర్షన్ డ్రామా!

- **రైతుకు సంకెళ్ల ఘటన పై నుంచి దృష్టి మళ్లించేందుకే అల్లు అర్జున్ అరెస్టు**
- **రోజంతా దీనిపైనే మీడియా కవరేజీ**
- **నేషనల్ మీడియాలోనూ హాట్‌టాపిక్**
- **ఎంపీ ప్రియాంక తొలి స్పీచ్‌కు కవరేజ్ నిల్**
- **రేవంత్ ఘనకార్యంపై అధిష్ఠానం గుర్రు**
- **మోహన్‌బాబు వివాదంతో మరోసారి డైవర్షన్‌కు ప్రయత్నం?**

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత వచ్చినప్పుడు కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీస్తారని రాజకీయవర్గాల్లో విమర్శ ఉన్నది. సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్ కూడా ప్రజల దృష్టి మళ్లించేందుకేనన్న చర్చ నడుస్తున్నది. అరెస్ట్ తీరు, రేవంత్ అనుకూల మీడియాలో హడావుడి ఇందుకు బలం చేకూర్చుతున్నదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అటకెక్కించడం, అనాలోచిత నిర్ణయాలు బెడిసికొట్టడం, ప్రతిపక్షాలతో పాటు సొంతపార్టీ నేతల నుంచి కూడా విమర్శలు రావడంతో రేవంత్ డైవర్షన్ ఎత్తుగడను ఎంచుకుంటున్నారని ఆరోపణలున్నాయి. లగచర్ల రైతుకు సంకెళ్లు వేయడంపై గురువారం తీవ్రదుమారం నెలకొంది. ఈ వ్యవహారాన్ని డైవర్ట్ చేసేందుకే ప్రభుత్వ పెద్దలు అల్లు అర్జున్ అరెస్టును తెరపైకి తెచ్చారనే ఆరోపణలున్నాయి.

సినీరంగంపై సీఎం కక్ష?

కాంగ్రెస్ పాలనపై సినీ ప్రముఖులు ఎవరూ పెద్దగా మాట్లాడటంలేదు. సోషల్ మీడియాలోనూ పోస్టులు పెట్టడం లేదు. రేవంత్‌రెడ్డి మాత్రం సినీప్రముఖులను భయపెట్టి దారికి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు సినీవర్గాల్లో చర్చ నడుస్తున్నది. సినిమా రంగాన్ని భయపెట్టేందుకే జాతీయస్థాయి క్రేజ్ ఉన్న అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయించారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలోనే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు సినిమా ప్రముఖులు ఎవరూ రాలేదని బహిరంగంగా అన్నారు. ఆ తర్వాత నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్ కూల్చివేయడం, నాగార్జున కుటుంబంపై మరోమంత్రి కొండా సురేఖ అసభ్యంగా మాట్లాడటం వంటి పరిణామాలు జరిగాయి. కొండా సురేఖపై సినీప్రముఖులంతా ముక్తకంఠంతో నిప్పులుచెరిగారు. దీంతో రేవంత్‌కు కక్ష మరింత పెరిగిందని, అందులో భాగంగానే అర్జున్ అరెస్టన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రియాంక స్పీచ్‌పై డైవర్షన్ ఎఫెక్ట్

వయనాడ్ ఎంపీగా ఎన్నికయిన కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీ లోక్‌సభలో శుక్రవారం తొలిసారి ప్రసంగించారు. కానీ ఆమె ప్రసంగానికి పెద్దగా కవరేజీ రాలేదు. నేషనల్ మీడియా కూడా అర్జున్ అరెస్ట్‌పైనే రోజంతా కథనాలు ఇచ్చింది. దీంతో ఢిల్లీలోనే ఉన్న రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసిన అధిష్ఠానం పెద్దలు ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే అల్లు అర్జున్ అరెస్టుతో భంగపడ్డ ప్రభుత్వం ఆ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికి కూడా శుక్రవారం తిప్పలు పడ్డట్టు కనిపిస్తున్నది. మీడియా ప్రతినిధి అరెస్ట్ కేసులో 'పారిపోయిన పెదరాయుడు', 'మోహన్ బాబు ఎక్కడ' '5 బృందాలతో గాలింపు' అంటూ అనుకూల మీడియాలో కథనాలు ప్రసారం చేయించినట్టు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఒక టాపిక్ నుంచి మరో టాపిక్‌కు డైవర్ట్ చేయడం మానుకుని పాలనపై డెడికేషన్ పెట్టాలంటూ నెటిజన్లు సూచిస్తున్నారు.

నాకే ఫాలోయింగ్.. నేనే స్టార్!

- **అల్లు అర్జున్ సినిమా తీసి, కోట్లు సంపాదించిండు**
- **బార్డర్‌లో యుద్ధం గెలిచి వచ్చిండా?**
- **ప్రాణం పోయినా అల్లు అర్జున్‌పై కేసు పెట్టొద్దా?: సీఎం రేవంత్**

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) 'అల్లు అర్జున్ ఏమైనా భారత్, పాక్ బార్డర్‌లో యుద్ధం చేసి గెలిచి వచ్చిండా? సినిమా తీసిండు.. కోట్లు సంపాదించిండు.. వెళ్లిపోయిండు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఒక ప్రైవేట్ టీవీ చానల్‌తో మాట్లాడిన ఆయన, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఉన్నదని, దానికి అనుగుణంగానే చట్టం పనిచేస్తుందని చెప్పారు. 'అల్లు అర్జున్ వల్ల ఒక తల్లి చనిపోయింది.. ఒక పిల్లాడు కోమాలో ఉన్నాడు. ఈ ఘటనకు కారణమైన అల్లు అర్జున్‌ను అరెస్టు చేస్తే తప్పేముంది? ఆ బాబు కోలుకొని తన తల్లి ఎక్కడ అని అడిగితే ఏం సమాధానం చెప్తాం? ప్రాణం పోయినా కేసు పెట్టొద్దా?' అంటూ ప్రశ్నించారు. కారులో వచ్చి సినిమా చూసి వెళ్తే ఎలాంటి సమస్యా ఉండకపోయేదని, కానీ కారులోంచి బయటికి వచ్చి చేతులూపి హడావుడి చేశారని, దాంతో జనం పెద్ద ఎత్తున ఎగబడడంతో పరిస్థితి కంట్రోల్ కాలేదని చెప్పారు. అందుకే ఆయనపై ఏ-1 కేసు పెట్టలేదని, మిగతా వారిపై పెట్టారని, అల్లు అర్జున్‌పై ఏ-11గా పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. తన ఫేవరెట్ హీరో కృష్ణ అని చెప్తూ.. ఆయన ఇప్పుడు లేరని, ఇప్పుడు తానే స్టార్‌నని, తనకే ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఉండాలన్నారు. అల్లు అర్జున్ అరెస్టయ్యాడని ఎవరైనా నిరసన తెలిపితే వాళ్లను కూడా జైల్లో వేస్తామని హెచ్చరించారు. మోహన్‌బాబు కేసు కోర్టు పరిధిలో ఉన్నదని పేర్కొన్నారు. ఫ్రీ బస్సు వల్ల మెట్రో రైలు నష్టాల్లో ఉందన్న చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌ను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించానని చెప్పారు. హామీల అమలుకు తొందరెందుకని, ఇంకా ఐదేండ్ల సమయం ఉన్నదని చెప్పుకొచ్చారు. రేవంత్ 28వ ఢిల్లీ పర్యటన ముగించుకొని శనివారం ఉదయం హైదరాబాద్ రాన్నారు. రెండు రోజులు వేచి చూసినా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంటు దొరక్కపోవటం గమనార్హం.

మంజీర బ్యారక్‌లో పుష్పరాజ్

- **ఫలించిన 'ఒక్కరోజైనా జైల్లో ఉంచాలనే కుట్ర'**
- **కాంగ్రెస్ సర్కార్ తీరుపై తీవ్ర విమర్శలు**
- **నేడు విడుదల కానున్న ఐకాన్ స్టార్**

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : జాతీయ ఉత్తమ నటుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై కేసు, అరెస్టు వెనుక పాలక పెద్దల వ్యూహం ఉన్నదా? శుక్రవారం లేటుగా అరెస్టు చేయడం, బెయిల్ వచ్చినా జైలులో ఉండేలా వారు పన్నిన పన్నాగమా? అంటే 'అవును' అనే అంటున్నారు బన్నీ ఫ్యాన్స్. శుక్రవారం మధ్యాహ్నం నుంచే బన్నీ అరెస్టుకు పోలీసులు సన్నాహాలు చేశారు. చకచకా అరెస్టు, గాంధీలో వైద్య పరీక్షలు, నాంపల్లి కోర్టులో బైండోవర్ చకచకా చేసేశారు. ఓ వైపు క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు నడుస్తుండగానే మరో వైపు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వెంటనే అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించి ప్రొసీడింగ్ చేస్తుండగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ ఆర్డర్ కాపీ జైలు అధికారులకు రాత్రి 10.30 గంటలైనా అందలేదు. కాపీలు అందడంలో ఆలస్యం కావడంతో అల్లు అర్జున్ కోసం జైలు అధికారులు క్లాస్-1 (మంజీర) బ్యారక్‌ను సిద్ధం చేశారు. బెయిల్ వచ్చినా విడుదల ప్రక్రియ ఆలస్యం కావడానికి పద్ధతి ప్రకారం, వ్యూహాత్మకంగా సీఎంవో కనుసన్నల్లోనే అంతా జరిగిందని బన్నీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. గతంలో హైడ్రా కూల్చివేతలు కూడా శుక్రవారం సాయంత్రమే చేపట్టడం, కోర్టుకు వెళ్లే సమయం ఇవ్వకపోవడం, శని, ఆదివారాలు కోర్టులకు సెలవులు కావడం వంటి అవకాశాలను వాడుకున్నారని, సోమవారం కోర్టుకు వెళ్లినా ఆ లోపే అంతా కూల్చివేసి కుట్రపూరితంగా వ్యవహరించేవారని గుర్తుచేస్తున్నారు.

సాయంత్రం 6 దాటితే.. నో బెయిల్!

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కార్ పెద్దల డైరెక్షన్ మేరకు కనీసం ఒక్కరోజైనా అల్లు అర్జున్‌ను జైల్లో పెట్టాలనే కుట్ర వ్యూహాత్మకంగా ఫలించిందని రాజకీయ విమర్శకులు చెప్తున్నారు. కావాలనే జైలు మాన్యువల్ ప్రకారం సాయంత్రం ఆలస్యంగా చంచల్‌గూడ జైలుకు తరలించినట్టు తెలుస్తున్నది. జైలు మ్యాన్యువల్ ప్రకారం ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటల లోపు బెయిల్ బాక్స్‌ను ఓపెన్ చేస్తుంటారు. వారు ఓపెన్ చేసే సమయానికి బెయిల్ పొందిన సంబంధిత వ్యక్తుల బెయిల్ పేపర్లు అందులో ఉండాలి. సాయంత్రం 6 గంటల తర్వాత వచ్చిన ఏ బెయిల్ పేపర్లు అయినా జైలు నిబంధనల ప్రకారం మరుసటి రోజు ఉదయమే ఓపెన్ చేసి, బెయిల్ ప్రాసెస్ మొదలు పెడతారు. ఈ క్రమంలో కావాలనే 6 గంటలు దాటినా బెయిల్ పేపర్లు ఇవ్వలేదని సమాచారం. ఈ క్రమంలో కనీసం ఒక్కరోజైనా అల్లు అర్జున్‌ను జైలులో ఉంచాలనే ఆశయం నెరవేర్చుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

లోకం పోకడ

బేడీలు నాకేస్తున్నారేం? నేను రైతును కాదు.. దొంగను!

తప్పెవరిది? అరెస్ట్ చేసేదెవరిని?

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): అల్లు అర్జున్ అరెస్టు పాలకుల అభద్రతాభావానికి తార్కాణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అర్జున్ అరెస్టులో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఎక్స్ వేదికగా ఖండించారు. 'తొక్కిసలాట బాధితుల పట్ల నాకు పూర్తి సానుభూతి ఉన్నది, కానీ, అసలు తప్పు ఎవరిది? సంబంధం లేని అంశంలో అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం న్యాయమే అయితే, హైడ్రా పేరుతో పేదలను భయభ్రాంతులకు గురిచేసి, వారి మరణానికి కారణమైన రేవంత్‌రెడ్డిపైనా కేసులు పెట్టి అరెస్టు చేయాలి' అని డిమాండ్ చేశారు. 'అభద్రతా భావానికి గురైన నాయకుడు ఎప్పుడూ తన చుట్టూ ఉన్న వారిని విధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తాడు' అని ప్రముఖ అమెరికన్ రచయిత రాన్ కార్పెంటర్ వ్యాఖ్యలను ఉటంకించారు.

చట్టం ఎవ్వరికీ చుట్టం కావద్దు : హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు కారణమైన రేవంత్ బ్రదర్స్‌ను ఎందుకు అరెస్టు చేయరు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. అల్లు అర్జున్ అరెస్టును ఎక్స్ వేదికగా హరీశ్ ఖండించారు. 'సినిమా కోసం వెళ్లి తొక్కిసలాట జరిగి మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బెనిఫిట్ షోలకు అనుమతిచ్చిందెవరు? జాగ్రత్తలు తీసుకోకుండా సినిమాను ప్రదర్శించిందెవరు? కారకులు పాలకులే! చర్యలు తీసుకోవాల్సింది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పైనే!' అని పేర్కొన్నారు. 'ఏడాది పాలనలో రైతులను విద్యార్థులను బలిగొన్నందుకు ఎవరిని అరెస్టు చేయాలి?' అని నిలదీశారు.

రేవంత్ కక్షతోనే అల్లు అర్జున్ అరెస్ట్: ఎర్రబెల్లి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి కక్ష సాధింపులో భాగంగానే పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. రేవంత్ మూల్యం చెల్లించుకోక తప్పదని ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ అసమర్థత, పోలీసు వైఫల్యంతోనే తొక్కిలాసటలో మహిళ చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసును ఎత్తేసి అల్లు అర్జున్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బాబు కోసమే అర్జున్ అరెస్ట్ : శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): అల్లు అర్జున్ అరెస్ట్ ప్రభుత్వ కక్షసాధింపేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. చంద్రబాబును సంతోషపెట్టేందుకే అర్జున్‌ను అరెస్ట్ చేసినట్టు కనిపిస్తున్నదని ఆరోపించారు. సినీపరిశ్రమపై వరుస దాడుల వెనుక పెద్ద కుట్ర ఉన్నదని, సినీ పరిశ్రమ దెబ్బతింటే వేల కుటుంబాలు రోడ్డున పడుతాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అల్లు అర్జున్ అరెస్ట్ డ్రామా: తాతా మధు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనను పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం అల్లు అర్జున్ అరెస్ట్ డ్రామాకు తెరతీసిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆరోపించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని కాంగ్రెస్ నేతలు చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి సూసైట్ నోట్‌లో రేవంత్‌రెడ్డి, అతడి అన్నదమ్ముల పేర్లు రాశారని, వాళ్లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు.

అర్జున్ అరెస్టు సమ్మతం కాదు : వైఎస్ జగన్

అల్లు అర్జున్ అరెస్టును వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ ఖండించారు. తొక్కిసలాటలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం వల్ల ఆ కుటుంబానికి జరిగిన నష్టం ఎవరూ తీర్చలేనిదని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ ఘటనపై అల్లు అర్జున్ విచారాన్ని వ్యక్తంచేసి, ఆమె కుటుంబానికి అండగా ఉంటానని బాధ్యతాయుతంగా వ్యవహరించారని గుర్తుచేశారు. ఘటనకు నేరుగా అతడిని బాధ్యుడిని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అరెస్టు వెనుక చంద్రబాబు : లక్ష్మీపార్వతి

అల్లు అర్జున్ అరెస్ట్ వెనుక ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి హస్తం ఉన్నదని వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతి ఆరోపించారు. చంద్రబాబు నాయుడు పుష్కరాలకు, కందుకూరుకు వెళ్లినప్పుడు తొక్కిసలాటలో ఎంతో మంది చనిపోయారని గుర్తుచేశారు. ఈ లెక్కన చంద్రబాబు నాయుడిని పోలీసులు ఎన్నిసార్లు అరెస్ట్ చేయాలని, ఆయనను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు.